క్లుప్తంగా

అన్నదాన సత్రం ఏర్పాటుకు దాతల చేయూత



కారెంపూడి: శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రం నిర్మాణానికి కారెంపూడికి చెందిన సూరె ఆంజనేయులు, కరాలపాటి వెంకట గురుసుబ్బారావు, ఉప సర్పంచ్ సూరె అంకారావు సోమవారం విరాళాలు ప్రకటించారు. దాతలను అన్నదాన సత్రం నిర్మాణ కమిటీ ప్రతినిధులు సన్మానించారు. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మఠంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రం నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో విరాళాల సేకరణకు వచ్చిన సత్రం ప్రతినిధులు పక్క రాష్ట్రం నుంచి వచ్చినా కారెంపూడిలో దాతలు ఆదరణ చూపారని సత్రం నిర్మాణ కమిటీ ప్రతినిధులు వారికి ధన్యవాదాలు తెలిపి దాతలను సన్మానించారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



కారెంపూడి: వాతావరణం కలుషితమై పర్యావరణం ఇబ్బందుల్లో ఉందని పర్యావరణ పరిరక్షణ గురించి ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలని మండల ప్రత్యేక అధికారి జోసెఫ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రత్యేక అధికారి జోసెఫ్‌కుమార్, తహసీల్దార్ జి శ్రీనివాస్, ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డితో కలిసి నల్లమల అడవి ప్రాంతంలో సోమవారం సాయంత్రం పర్యటించారు. కారెంపూడికి చెందిన ప్రకృతి ప్రేమికుడు కొమెర అంకారావు (జాజి) పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషిని గుర్తించి మండల అధికారులు జాజితో కలిసి అడవిలో పర్యటించారు. వృక్ష సంపద తగ్గిపోతోందని వృక్షాలు తగ్గిపోయి అడవి తల్లి బోసిపోతోందని అడవికి పూర్వ వైభవం తేవడానికి మొక్కలు నాటుతున్నానని, అలాగే అడవిలో మొక్కల వ్యాప్తి కోసం విత్తల బంతులు చల్లుతున్నానని ప్లాస్టిక్ వల్ల అడవిలో బతుకుతున్న వన్యప్రాణులకు ఇబ్బందులు రాకూడదని ప్లాస్టిక్‌ను ఏరివేస్తున్నానని జాజి వారికి వివరించారు. నిస్వార్థంగా జాజి చేస్తున్న సేవలను ప్రత్యేక అధికారి అభినందించారు. జాజి లాగా పర్యావరణ పరిరక్షణ గురించి ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలని మండల అధికారులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఎన్నో ఏళ్లగా జరగని అభివృద్ధి ఈ ప్రభుత్వంలో జరిగింది

- యరపతినేని చేయలేని పని మీరు చేశారు 'సార్'
- రూ. 52 కోట్లతో జానపాడు రైల్వే బ్రిడ్జి మంజూరు
- జానపాడులో రెండు కోట్లతో మంచినీటి పథకం
- గడప గడపలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డితో స్థానికుల హర్షం



ఇంటి వద్దకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాసు మహేష్

పిడుగురాళ్ల: ముప్పై ఏళ్లల్లో యరపతినేని శ్రీనివాస రావు చేయలేని పని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసి చూపించడంతో గ్రామ ప్రజలు సార్ మీరు చేసిన అభివృద్ధి మరువలేమంటూ హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని జానపాడు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కార్యక్రమానికి హాజరు కావడంతో గ్రామ ప్రజలు, వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో హాజరై ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఏ నాయకుడు చేయలేని అభివృద్ధిని మా జానపాడు గ్రామస్తులకు అందించినందుకు ధన్యవాదాలంటూ నినాదాలతో ప్రజలు హోరెత్తించారు. ముందుగా ఎస్సీ కాలనీలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి గడపకు హాజరై రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ప్రభుత్వ పథకాలు వివరించడంతోపాటు ఇప్పటి వరకు ప్రతి ఇంటికి ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. ప్రతి మహిళ, ప్రతి కుటుంబీకులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రావడంతోటే కాలనీలో ఎప్పుడు లేని విధంగా అభివృద్ధి జరిగిందని, సీసీ రోడ్లు వేశారని, వృద్ధాప్య పింఛన్లు వస్తున్నాయని, అమ్మ ఒడి పథకం ద్వారా నగదు తమ ఖాతాల్లో జమ అవుతున్నాయని, రైతులు రైతు భరోసా ద్వారా తమ ఖాతాల్లో నగదు జమ అయ్యాయని ఇలా ప్రభుత్వ పథకాలు తమకు అందాయని ప్రజలు ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా ఎమ్మెల్యేకు తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన...

అదేవిధంగా తమ ప్రాంతంలో కూడా సీసీ రోడ్లు వేసి శుభ్రంగా ఉంచారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ జానపాడు అభివృద్ధి కోసం గతంలో ఎన్నడు లేని విధంగా కృషి చేశామన్నారు. ప్రధానంగా రూ. 52 కోట్లతో జానపాడు రోడ్డులోని రైల్వే బ్రిడ్జి మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయని తెలిపారు. అలాగే గ్రామంలో రూ. 3.50 కోట్లతో సైడు కాలువలు, డ్రైనేజీని నిర్మించడం జరిగిందన్నారు. ఎస్సీ కాలనీలో రూ. 40 లక్షలతో సిమెంట్ రోడ్లు, వందేళ్ల నుంచి సమస్యగా మారిన చాకిరేవు బ్రిడ్జి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 87 లక్షలతో చారిరేవు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయటం జరిగిందని తెలిపారు. అలాగే గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ వంటివి రూ. కోటితో నిర్మించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఇప్పుడు గ్రామంలోని ప్రతి ఇంటికి మంచినీటిని ఇచ్చేందుకు రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేయించానని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే గ్రామంలో అర్హత ఉన్న 375 మందికి ఇళ్ల పట్టాలను అందించడం జరిగిందన్నారు. ఇంకా అర్హులు ఉన్నారని గుర్తించామని, వారి కోసం కూడా సుమారు 3 ఎకరాలు భూమిని కొనుగోలు చేయబోతున్నామని పేర్కొన్నారు. రూ. 15 లక్షలతో ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ స్కీమ్‌ను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గ్రామంలో 75 వాటర్ ట్యాంక్‌లు, మోటర్లను నిర్మించడం జరిగిందని తెలిపారు. ముస్లింలకు 15 సెంట్ల స్థలాన్ని షాదీఖానాకు కేటాయించామని, ఎస్సీలకు రెండు కమ్యూనిటీ హాల్స్ కోసం స్థలం కేటాయించామని తెలిపారు. అంతేకాకుండా ముస్లింలు, హిందువులు, ఎస్సీల శ్మశానల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, గ్రామ సర్పంచ్ గడిపూడి వెంకట రమణ, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, నాయకులు గడిపూడి పుల్లయ్య, మాజీ సర్పంచ్ తాళ్లపోగు మర్యాదరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఉన్నంనరసింహారావు, డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జునరావు, సొసైటీ అధ్యక్షుడు ఉన్నం శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు కూరపాటి కొండలు, ఉన్నం శ్రీనివాస రావు, మోర్జంపాటి కాశీం, జమాల్, వైఎస్ ఎంపీపీ సాతులూరి బాబు, గార్లపాటి వెంకటేశ్వరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వర రెడ్డి, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్, ఎంపీటీసీలు మన్నెం శ్రీనివాసరావు, షేక్ బుడే, కొతారు నరసింహారావు, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీఓ కాశయ్య, పంచాయితీ సెక్రటరీ స్వామినాయక్, వీఆర్వోలు ప్రసాద్, సీతరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సాహిస్తామని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్ రెడ్డి అన్నారు. కేఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఎమ్మెల్యే కాసు ప్రారంభించారు. క్రీడాకారులను ఎమ్మెల్యే కాసు పరిచయం చేసుకుని క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ...పల్నాడు ప్రాంతంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని, ప్రభుత్వం పరంగా, వ్యక్తిగతంగా వీరికి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో క్రీడలు ఆడేందుకు యువకులు ఇష్టపడేవారని, కానీ ఇప్పుడు చూసేవారు ఎక్కువగా ఉండి ఆడే వారు తక్కువగా ఉన్నారని ఆయన అన్నారు. ఇక్కడ వాకింగ్ కోర్టుల, ఇండోర్ షటిల్ కోర్టు, రన్నింగ్ ట్రాక్ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఆదర్శ పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీస్థలాన్ని క్రికెట్ ఆట కోసం అభివృద్ధి చేస్తామని, క్రీడాకారులను ప్రతిభను బయటకు తీసేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని ఎమ్మెల్యే కాసు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ కలకండ ఆంధ్రయ్య, మాజీ చైర్మన్ గోట్టిముక్కల పెదహనిమిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా, నిర్వాహకులు కొప్పుల రవి, యార్డు డైరెక్టర్లు యర్రంశెట్టి సైదారావుతదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో 17 సీట్లు సాధించిన విద్యార్థులు

దాచేపల్లి : మాదినపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు టి. శాంతారావు సోమవారం తెలిపారు. ఈ పాఠశాల నుంచి 18 మంది విద్యార్థులు ఆరవ తరగతిలో ప్రవేశం కోసం పరీక్ష రాశారని, వారిలో 17 మంది విద్యార్థులు సీట్లు సాధించారని ఆయన వెల్లడించారు. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న చింతకింద కోటేశ్వరరావు వేసవి సెలవుల్లో విద్యార్థులు ప్రత్యేకంగా కోచింగ్ ఇచ్చారని, కోటేశ్వరరావు ప్రోత్సాహంతో విద్యార్థులు అత్యధికంగా మండల స్థాయిలోనే సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు శాంతారావు చెప్పారు. ఇర్ల జానకీరామ్ మండల స్థాయిలో 3వ ర్యాంక్ సాధించనట్లు ఆయన తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను ఎంఈఓలు శ్రీనివాసరావు, పినకపాని, సర్పంచ్ అనుముల అంజిరెడ్డి, ఎంపీటీసీ నంద్యాల వీరారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు లింగారెడ్డి, అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి పేదవాడిని ఆరోగ్య పరంగా అన్నీ విధాలుగా ఆదుకోవడానికి ఆరోగ్య శ్రీ కింద వేలాది రోగాలకు ఉచిత వైద్యమందిస్తూ ఆ పరిధిలోకి రాని వారికి లక్షల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ కింద అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మాచర్ల నియోజక వర్గంలోని అనారోగ్యానికి గురైన ఇద్దరు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 1.95 లక్షలు చెక్కులు అందజేశారు. క్యాంపు కార్యాలయంలో ఆయన బాధిత కుటుంబాలకు చెందిన మహంకాళి మల్లేశ్వరికు రూ. 65,000, శ్యామల రామకృష్ణారెడ్డి కు రూ. 13,5000 సీఎం సహాయ నిధి కింద చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల నియోజక వర్గంలో సీఎం సహాయ నిధి కింద ఆయా కుటుంబ సభ్యులకు ఇప్పటికి రూ. 3.50 కోట్ల సీఎం సహాయ నిధి కింద అందజేయటం జరిగిందన్నారు. వేలాది మందికి ప్రయోజనం కల్పించి ఏ ఒక్క పేద కుటుంబం ఆరోగ్య పరంగా మృతి చెందకూడదని సీఎం తీసుకున్న చర్యల వల్లే ఇన్ని కోట్ల రూపాయలు బాధితులకు అందజేయటం జరుగుతుందన్నారు. పేదలందరు ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బాధిత కుటుంబాలతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రెంటచింతల: వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని కంభంపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ కుమార్ అన్నారు. సోమవారం కంభంపాడు పీహెచ్‌సీ పరిధిలోని కంభంపాడు గ్రామంలో మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించిన అనంతరం మాట్లాడారు. ఇళ్లలో పాతటైర్లు, కొబ్బరిబోండాలను తొలిగించాలని కూలర్‌లలోని నీటిని వారానికి ఒకసారి మార్చుకోవాలన్నారు. దోమలను పారద్రోలడం వల్ల డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, బోదవ్యాధి వంటి వ్యాధులు దరిచేరవన్నారు. నివాసపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లముందున్న సైడ్‌కాలువలలో కిరోసిన్ లేదా బ్లీచింగ్ చల్లుకోవాలని దీంతో ఈగలు, దోమలు నశిస్తాయని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ మలేరియా సూపర్ వైజర్‌లు ఎస్‌కే నాగూర్ భాష, హెల్త్ అసిస్టెంట్‌లు బాలయ్య, శివ, మురళి, సుబ్బారెడ్డి, ఏఎన్ఎంలు శివమ్మ, శౌరీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

కారెంపూడి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పోలీస్ కాంప్లెక్స్ వద్ద రోడ్డు కల్వర్టు కింద వేసిన డ్రైనేజీ పైపులు మట్టితో పూరుకుపోయి నీటి పారుదలకు అవరోధం కలగడంతో పాత దోనెలను తొలగించి కొత్తవి వేసే పనులను ఆర్‌అండ్‌బీ శాఖ సోమవారం చేపట్టింది. ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డుకు దిగువన డ్రైనేజీ నీటి పారుదల కోసం వేసిన చిన్న దోనెలను తొలగించి పెద్దవి వేస్తున్నారు. గతంలో ఒక వరుసలో ఉన్న దోనెలను తొలగించి ప్రస్తుతం పెద్దవి రెండు వరుసల్లో అమర్చుతున్నారు. పొక్లయినర్‌తో ముందు తవ్వి పాత కల్వర్టు దోనెలను తొలగించారు. తర్వాత జేసీబీతో కొత్త దోనెలు అమర్చే పనులు జరుగుతున్నాయి. క్రేన్‌తో దోనెలను తరలించి వాటిని అక్కడ ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం నాటికి దోనెలు అమర్చే పనులు వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయవచ్చని తర్వాత కల్వర్టు కాంక్రీటు వేయాల్సి ఉందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఆర్‌అండ్‌బీ శాఖ చర్యలు చేపట్టింది. ట్రాఫిక్ సమస్య ఉండడంతో మరమ్మతు పనులకు అంతరాయం కలుగుతోంది. దీంతో పాటు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. గ్రామ సర్పంచ్ తేజానాయక్‌తో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు జరుగుతున్న పనులను పట్ల శ్రద్ధ చూపుతున్నారు.

బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోండి

సీఐ ఆంజనేయులు

పిడుగురాళ్ల: ముస్లింలు బక్రీదు పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు సూచించారు. పట్టణంలోని అంజుమన్ కమిటీ కార్యాలయంలో సోమవారం ముస్లిం సోదరులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ సీఐ మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా ముస్లిం సోదరులందరు కలిసిమెలిసి భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. తమ విధి నిర్వహణలో భాగంగా ముందస్తు జాగ్రత్తలు తెలపాల్సి ఉన్నందున ఇటువంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ మేస్త్రీ మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీన జరుపుకోనున్న బక్రీద్ పండుగను ఎంతో శాంతియుతంగా, ఐక్యమత్యంగా అందరు కలిసిమెలిసి జరుపుకుంటామని తెలిపారు. మత పెద్దలు ఎండీ బాబర్, ఎండీ గఫార్, కరిముల్లా మేస్త్రీ, షేక్ మస్తాన్‌వలి, ఎస్ఐ పఠాన్ రబ్బానీఖాన్ ముస్లీం మత పెద్దలు, పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న సీఐ జయకుమార్, జెడ్పీటీసీ షఫీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ విద్యార్థులు



పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణ సీఐ, ఎస్ఈబీ సీఐలు

కారెంపూడి : యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కారెంపూడి సీఐ దార్ల జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు హెచ్చరించారు. స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో సోమవారం డ్రగ్స్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను సీఐ, ఎస్ఐలు విద్యార్థులకు వివరించారు. అంతకు ముందు డ్రగ్స్ వాడకాల నిరోధానికి పోలీస్ శాఖకు సహకరించాలని గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. యువతకు గంజాయి లాంటి మత్తు పదార్థాలను విక్రయించే వారిపై చాలా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను అమ్మే వారి వివరాలను పోలీస్ శాఖకు అందించాలని అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సిగరెట్లు,గుట్కాలకు అలవాటు పడి తర్వాత మత్తు కోసం గంజాయి లాంటి ప్రాణాంతక పదార్థాలను వాడుతున్నారని జెడ్పీటీసీ షేక్ షఫీ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పిల్లవాడి భవిష్యత్తుతో ఒక కుటుంబ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని యువత పెడత్రోవ పడితే సమాజ మనుగడే ప్రమాదంలో పడిపోతుందని మత్తు పదార్థాలకు స్వస్తి పలుకుదామని జెడ్పీటీసీ పిలుపునిచ్చారు. గంజాయి వాడకం పెరుగుతోందనే ప్రమాదఘంటికలు మోగుతున్నాయని గంజాయి మత్తులో వివిధ రకాల అశాంతికి యువత కారణం కావడం గమనిస్తున్నామన్నారు. దయచేసి ముఖ్యంగా విద్యార్థులు చాలా అప్రమత్తంగా ఉండాలని కోరారు. విద్యా సంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు చాలా అప్రమత్తంగా ఉండాలని తమ పిల్లల నడవడిక నిత్యం గమనిస్తూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం టి రఘుబాబు, విద్యాకమిటీ చైర్మన్ ఆతుకూరి గోపి, వైఎస్సార్ సీపీ నాయకుడు కిల్లా కాశి పాల్గొన్నారు.

గురజాల : మాదక ద్రవ్యాలు ఆరోగ్యానికి చేటు చేస్తాయని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీబాషా అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబాలు సుఖంగా ఆనందంగా ఉండాలంటే ప్రతి ఒక్క విద్యార్థి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అదే విధంగా మీ కుటుంబ సభ్యులకు మాదక ద్రవ్యాలు వాడే అలవాటు ఉంటే వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కలివెల ప్రభుదాసు, బి జ్ఞానసుందరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురజాల : యువత మత్తు పదార్థాలకు బానిలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ కె ప్రభాకర్‌రావు సూచించారు. స్థానిక జయభారత్ జూనియర్ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు అయితే వారి కుటుంబాలు నష్టపోతాయని, అంతేకాకుండా వారి ఆరోగ్య పరిస్థితులు క్షీణించిపోతాయన్నారు. మత్తు పదార్థాల వల్ల ఎన్నో అనర్థాలు సంభవిస్తాయన్నారు. మత్తు పదార్థాలు స్వీకరించడం వల్ల కలుగు నష్టాలు గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ ఎస్ఐ జయరాం, ఎస్ఐలు అశోక్‌కుమార్, బి అనంత కృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాచర్ల: పట్టణంలోని వివిధ కళాశాలలో విద్యార్థులతో అర్బన్ సీఐ టి బాలకృష్ణ, ఎస్ఈబి ఇన్స్‌పెక్టర్ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అర్బన్ సీఐ టి బాలకృష్ణ, ఎస్ఈబి ఇన్స్‌పెక్టర్ ప్రసాదరెడ్డిలు మాట్లాడుతూ నియోజక వర్గంలో డ్రగ్స్ నిరోధించడంలో రెండు శాఖలు ముమ్మరంగా దాడులు చేసినట్లు చెప్పారు. ఎక్కడా రాజీ పడకుండా దాడులు నిర్వహించి డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు వారిని చైతన్యపరిచినట్లు తెలిపారు. చక్రధర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ పోలీసు, ఎస్ఈబి సిబ్బంది, ఆయా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు, ఎస్ఈబీ సీఐ ఎస్. కొండారెడ్డిలు తెలిపారు. పట్టణంలోని మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్, ఎస్ఈబీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ర్యాలీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పట్టణంలోని స్కాలర్ విద్యా సంస్థల నుంచి ఐలాండ్ సెంటర్ మీదుగా పోలీస్ స్టేషన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐలు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారితే వారి కుటుంబాలు పూర్తిగా నష్టపోయి ఇబ్బందులు పడడంతోపాటు వారి కుటుంబాలు కూడా నష్టపోతాయని తెలిపారు. మత్తు పదార్థాలకు ఎంత దూరంగా ఉంటే అంత ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. యువత ఈ విషయాన్ని గ్రహించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఎవరైనా చెడు వ్యసనాలకు అలవాటు అవుతుంటే అటువంటి అలవాట్ల నుంచి దూరమయ్యేందుకు సూచించాలని ఈ సందర్భంగా తెలిపారు. మత్తుకు బానిసలైతే గొడవలు, ఘర్షణలకు దారి తీసి నేరస్తులుగా మారే అవకాశం ఉందన్నారు. అందుకే యువత మత్తుకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా వారు సూచించారు. అనంతరం మానవహారం నిర్వహించి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీలో పోలీస్, ఎస్ఈబీ సిబ్బందితోపాటు పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్, రూరల్ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్, జి. శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: నేటియువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాల మేరకు ఉజ్వల భవిష్యత్తుకు శ్రీకారం చుట్టాలని కోరారు. రూరల్ సీఐ షేక్ షమీముల్లా కోరారు. సోమవారం న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ఈ దశలో అధ్యాపకులు బోధించిన విద్యనందుకుని తమ భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని, చెడు వ్యసనాలకు బానిసలుగా మారితే మీ భవిష్యత్‌తో పాటు కుటుంబాలు కూడా ఎంతగానో నష్టపోతాయన్నారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లు, దిన చర్యల పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ అనిల్ కుమార్ రెడ్డి, కళాశాల సెక్రెటరీ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ జగదీశ్వర రెడ్డిలున్నారు.

గన్నవరంలో కోతముక్కల ఆటలో రూ. 2500లు స్వాధీనం మండలంలోని గన్నవరం గ్రామంలో పేకాటాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 2500లు స్వాధీనపరుచుకున్నట్లు రూరల్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని కోర్టుకు హాజరుపర్చినట్లు తెలిపారు.

మత్తు పదార్థాలకు యువత బానిస కాకూడదు

జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళీగంగాధర్‌రావు

పిడుగురాళ్ల: యువత మత్తు పదార్థాలకు బానిసలైతే వారి భవిష్యత్ అంధకారం అవుతుందని, అందుకే యువత మత్తు పదార్థాలకు చాలా దూరంగా ఉండాలని పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎం. మురళీగంగాధర్ రావు అన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మురళీగంగాధర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల చట్టాల గురించి వివరించారు. నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలై వారు బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, అటువంటి వాటిని వినియోగించటం మంచిది కాదని సూచించారు. మత్తు పదార్థాల జోలికి వెళ్తే యువత వారి జీవితాలను నాశనం చేసుకున్న వారు అవుతారని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం, అమ్మడం చట్ట రిత్యా నేరమని, అట్టి వారికి కఠిన శిక్షణలు ఉంటాయని ఈసందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు, ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్, కళాశాల ప్రిన్సిపల్ సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను గుర్తించడమే జగనన్న సురక్ష లక్ష్యం

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



సంక్షేమ పథకాలు రాని వారి వివరాలు సేకరిస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ఎంపీడీఓ

రెంటచింతల: గ్రామాల్లో అర్హత ఉండి ఇప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి అందించాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తహసీల్దార్ కట్టికోట పుల్లారావు అన్నారు. సోమవారం మండలంలోని గోలి గ్రామ సచివాలయ ఆవరణలో మిట్టగుడిపాడు, మల్లవరం, గోలి, జెట్టిపాలెం గ్రామ వలంటీర్లకు, సచివాలయాల సిబ్బందికి, గృహసారధులకు జగనన్న సురక్ష కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జనన, మరణ, కుల, ఆదాయ, సీ.సీ. ఆర్.సీ కార్డులు, రేషన్ కార్డులను ఉచితంగా అందించేందుకు ఈ కార్యక్రమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టినట్లు తెలిపారు. ఎంపీపీ దాసరి చౌడేశ్వరి మాట్లాడుతూ గ్రామాల్లో కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా అర్హులైన ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జూలై 1 నుంచి 31 వరకు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడానికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారధులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి, కార్యదర్శి శీలం సుబ్బారావు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారధులతో కలిసి గోలి గ్రామంలో ఇంటింటికి వెళ్లి అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను సేకరించారు.

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని అడిగొప్పల గ్రామంలో సోమవారం నిర్వహించారు. మండలానికి చెందిన ప్రభుత్వ అధికారులతో పాటు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, గృహసారధులు అడిగొప్పల గ్రామ సచివాలయ పరిధిలోని ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి కె సంజీవరావు నేతృత్వంలో గ్రామంలో వివిధ కారణాలతో ప్రభుత్వ పథకాలు అందని ప్రజల వివరాలను సేకరించారు. తహసీల్దార్ రమేష్ కుమార్ మాట్లాడుతూ అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు రాని వారు ఉంటే తెలిపితే తక్షణమే వారికి సర్టిఫికెట్‌తో పాటు పథకాన్ని వారికి అక్కడికక్కడే అర్హులుగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె సమతావాణి, సర్పంచ్ నలబోతు వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ బొబ్బా సీతారామిరెడ్డి, విఆర్ఓ ఎస్ జీరయ్య, సెక్రెటరీ హఫీజుద్దీన్, ఎంఎల్ఓ తోటకూర శంకర్, జెసిఎస్ కన్వీనర్లు తదితురులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: అర్హతే ప్రమాణికంగా అన్నీ వర్గాల వారికి జగనన్న నవరత్నాలు అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష పథకం ద్వారా అధికారులందరూ ఇంటి వద్దకే వచ్చి పథకాలు రాని వారికి అందజేయనున్నామని మండల ప్రత్యేక అధికారి గబ్రూనాయక్, ఎంపీడీఓ కోటేశ్వరరావులు తెలిపారు. సోమవారం మండలంలోని కంభంపాడు గ్రామంలో ఇంటింటికీ జగనన్న సురక్ష పథకాన్ని వివరిస్తూ వారు మాట్లాడారు. ఏ కారణం చేతనైనా అర్హత ఉండి పథకం అందకపోతే తమకు వివరాలు అందిస్తే వెంటనే సర్టిఫికెట్ అందించి పథకాన్ని అందజేస్తామన్నారు.